



ఈ చిత్రం కక్కలపల్లి గ్రామ పరిధి ప్రజాశక్తి కాలనీ సమీపంలోనిది. ఇక్కడ మరువ వంక పారుతోంది. కక్కలపల్లి చెరువు నుంచి వంక ప్రవహిస్తుంది. ప్రజాశక్తి కాలనీ ఉత్తరం వైపున ఈ వంక ఉంది. వంక దాదాపు 100అడుగులుపైగా వెడల్పు ఉండాలి. కాలనీ సమీపంలో వెంచర్ దారులు వంకను ఆక్రమించి, ప్లాట్లు వేశారు. దీంతో ఒకచోట ఐదు అడుగులకు వంక కుంచించుకుపోయింది.

ఇక్కడ ఓ విల్లా ఏర్పాటుదారుడైతే ఏకంగా వందకుపైగా అడుగుల వెడల్పు ఉన్న వంకను ఆక్రమించి, ఐదారు అడుగుల వెడల్పుతో కాలువ నిర్మాణం చేస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. సదరు విల్లాతోపాటు వంకలోని నీటి కాలువ ద్వారా విల్లాలోని నీటిని వదిలేందుకు కాలువ పనులు చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో స్థానికంగా పారుతున్న వంక నీటిని కూడా ప్రజాశక్తి కాలనీ వైపు మళ్లించాడు. ఆక్రమణలతో వంక కుంచించుకుపోవడంతోపాటు నీటిని కాలనీ వైపు మళ్లించడంతో ఇటీవల కాలనీ మునిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఇది బీజేపీ కొట్టాల పైభాగంలోని ఆర్డీటీ ఇళ్ల వెనుక వైపు పరిస్థితి. ఇక్కడ ఎర్రవంక ప్రవహిస్తుంది. 60 అడుగుల వెడల్పుతో వంక పారాల్సి ఉంది. ఓ వెంచర్‌దారుడు వంకను ఆక్రమించాడు. ఆక్రమిత వంక ప్రదేశంలో ఓచోట ప్లాట్ వేసి కంచె కూడా నాటించేశాడు. దీంతో వంక ఐదడుగులకు కుంచించుకుపోయింది. ఈక్రమంలోనే ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున కురిసిన వర్షానికి నీరంతా బీజేపీ కొట్టాల్లోకి చేరింది.

యథేచ్ఛగా కక్కలపల్లిలో వంకల ఆక్రమణ



ఇది కక్కలపల్లి పంచాయతీ కార్యాలయానికి అత్యంత సమీపంలోనిది. ఇక్కడ ఎర్రవంక వంద అడుగులకుపైగా వెడల్పుతో ఉండాలి. స్థానికంగా చెక్‌డ్యాం కూడా కట్టారు. ఓ వెంచర్‌దారుడు చెక్‌డ్యాంను ఆక్రమించి ప్రహరీ ఏర్పాటు చేశాడు. వంకను కూడా చాలావరకు ఆక్రమించేశాడు. పైభాగంలో నుంచి నీటి ప్రవాహాన్ని కూడా వెంచర్ పక్కనుంచి ప్రవహించేలా ప్రీకాస్ట్ వేశాడు. ఇంకేముంది ఇటీవల కురిసిన వర్షానికి వరద నీరు ఎక్కువై చెక్‌డ్యాం పక్కన కోతకు గురైంది. అధికారులు కూడా అక్కడ పరిశీలించి ప్రీకాస్ట్‌ను కొంత తొలగించారు. స్థానికంగా గ్రామానికి సంబంధించిన శ్మశాన వాటిక కూడా ఉంది. దానిని కూడా వెంచర్‌దారుడు కొంతమేర ఆక్రమించినట్లు గ్రామస్థులు అంటున్నారు. ఇలా వెంచర్‌దారులు ఎవరికి వారు వంకలను ఆక్రమించేశారు. దీంతో కాలనీలు నీట మునిగాయంటూ స్థానికులు వాపోతున్నారు.

ఆక్రమణలే ముంచాయి..!

కాలనీలను ముంచెత్తిన వాన నీరు
ప్రజాశక్తి, బీజేపీ కాలనీల మునక
నిద్రమత్తులో అధికార యంత్రాంగం



అనంతపురం రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి):వంకలు, వాగుల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. ఇదే ఇటీవల కాలనీలు నీట మునిగేందుకు కారణమని స్పష్టమవుతోంది. ఈనెల 15వ తేదీన కురిసిన వర్షానికి అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పరిధి ప్రజాశక్తి, బీజేపీ కాలనీలు నీట మునిగాయి. గ్రామ పరిధిలోని వంకల ఆక్రమణలే ఇందుకు కారణమని స్పష్టమవుతోంది. స్థానికంగా ఉన్న వంకలను ఎక్కడికక్కడ ఆక్రమించడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో వరద నీరంతా ఆయా కాలనీల్లోకి చేరింది. ఇళ్లలోకి నీరు చేరి కాలనీల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆక్రమణదారులు వంకలను యథేచ్ఛగా ఆక్రమించుకుని పబ్బం గడుపుకుంటున్నారు. వంకలు, వాగులు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన సంబంధిత యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోంది. సమస్యలు వచ్చినపుడు తప్ప.. అటువైపు తొంగి చూడని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆక్రమణదారులు మరింత పేట్రేగిపోయి ఎక్కడికక్కడ వంకలు, వాగులను ఆక్రమిస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

కక్కలపల్లి సమీపంలో ఎర్రవంక, మరువ వంక ప్రవహిస్తున్నాయి. ఎర్రవంక పండమేరు నుంచి బీజేపీ కాలనీ, ప్రజాశక్తి నగర్ మీదుగా ప్రవహిస్తోంది. మరువ వంక కక్కలపల్లి చెరువు నుంచి ఆపై ఉన్న కాట్నేకాలువ ప్రాంతం నుంచి ప్రవహిస్తోంది. ఈ వంకలోకి ఆలమూరు సమీపంలోని ఎర్రగొండ పరిసర ప్రాంతాల్లోని నీరు కూడా కలుస్తోంది. ఈ రెండు వంకలు రుద్రంపేటకు ఆనుకుని ఉన్న నడిమి వంకలోకి కలుస్తాయి. కక్కలపల్లి ప్రాంతాల్లో ఉన్న వంకను కొంతమంది విల్లా, వెంచర్‌దారులు యథేచ్ఛగా ఆక్రమించుకున్నారు. దీంతో వంకలు ఎక్కడిక్కడ కుంచించుకుపోయాయి. ఈక్రమంలో వర్షాలకు వరద నీరు ఎక్కువై వంకలో ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈక్రమంలోనే గత వారంలో కురిసిన వర్షాలకు బీజేపీ, ప్రజాశక్తి కాలనీలు నీటమునిగాయి.

కాలనీలు ఏర్పాటై 20 ఏళ్లు పైబడినట్లు తెలుస్తోంది. ఏనాడూ ఇలా నీట మునగలేదని స్థానికులు అంటున్నారు. వంకలను ఆక్రమించడంతోనే ఈ దుస్థితి దాపురించిందని వారు వాపోతున్నారు.

యంత్రాంగం నిద్రమత్తు

వంకలు, వాగులు, చెరువులు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవుతున్నా.. సంబంధిత అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాలు, వరదలు వచ్చినపుడు తప్ప.. అటువైపు కూడా తొంగిచూడడం లేదు. వంకలు, వాగులు, చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులపై ఉంది. వారు ఏమాత్రం పట్టించుకోవట్లేదు. కొంతలో కొంతైనా వంకలు, వాగులు, చెరువుల పరిరక్షణపై దృష్టిపెడితే.. విపత్తుల వల్ల కలిగే నష్టాలను అరికట్టే వీలుంటుంది. ప్రజలు ఆర్థికంగా నష్టపోకుండా చూడవచ్చు. ఆ పనులను కూడా చేయకపోవడంతో కాలనీలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికైనా ఆక్రమణలపై చర్యలు తీసుకుంటే కొంతలో కొంతైనా ప్రజలకు మేలు చేసిన అధికారులుగా మిగిలే అవకాశం ఉంటుంది. మరి ఏమేరకు స్పందిస్తారో..?

ఇక్కడికి రా..!

- హంద్రీనీవా అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ సవాళ్లు, ప్రతిసవాళ్లు
- బహిరంగ చర్చకు సిద్ధమైన ప్రభుత్వ విప్ కాలవ, వైసీపీ ఎమ్మెల్సీ
- చెరో చోటుకు రావాలనడంతో పరస్పరం విమర్శలు

రాయదుర్గం/బెళుగుప్ప, మే 21(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా పథకం అభివృద్ధిపై సవాల్ విసిరిన వైసీపీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి బహిరంగ చర్చకు రాకుండా కుంటిసాకులు చెబుతున్నారని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. హంద్రీనీవా కాలువ విస్తరణ పనుల పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబుపై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విమర్శలు చేశారు. దీంతో అనవసర ఆరోపణలు మాని, ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు రావాలని కాలవ



చర్చలో శివరామిరెడ్డి కోసం కుర్చీని కేటాయించి ఎదురు చూస్తున్న కాలవ

సవాలు విసిరారు. దీంతో నియోజకవర్గంలో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని శివరామిరెడ్డి ప్రతి సవాల్ చేశారు. దీంతో హంద్రీనీవాకు కీలకమైన జీడిపల్లి రిజర్వాయరు వద్ద వేదికకు రావాలని కాలవ తెలుపగా, వర్షం వస్తోందని, ప్రయాణానికి ఇబ్బంది ఉంటుందని, ఉరవకొండలోని శిలాఫలకం వద్దకి రావాలని శివరామిరెడ్డి కోరారు. దీంతో కుంటిసాకులు చెబుతూ తప్పించుకుంటున్నారా అని కాలవ ఎద్దేవా చేశారు. సవాల్, ప్రతిసవాల్ నేపథ్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు కాలవ చేరుకున్నారు. చర్చకు ఏర్పాట్లు చేయించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోసం మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కడే ఎదురు చూశారు. ఆయన రాకపోవడంతో 'దమ్ము, ధైర్యం లేనోడికి బహిరంగ సవాళ్లు ఎందుకు?' అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో హంద్రీనీవాపై నిర్లక్ష్యాన్ని ఎండగడతారనే భయంతోనే పలాయనం చిత్తగించారని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ ఆలోచన నుంచే హంద్రీనీవా ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని వివరించారు. 1996లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయని, వైఎస్సార్ పాలనలో వేగం పుంజుకున్నాయని అన్నారు. అయితే అదే స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. 2014లో చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడంతో ప్రాజెక్టు ఫలాలు ప్రజలకు చేరువయ్యాయని అన్నారు. కాలువ సామర్థ్యాన్ని 700 క్యూసెక్కుల నుంచి రెండువేల క్యూసెక్కులకు పెంచారని అన్నారు. ప్రధాన, ఉప కాలువలు, రిజర్వాయర్ల నిర్మాణం 2019లోపు పూర్తి చేయించారని అన్నారు. ఫేజ్ 1, 2 పనులకు ప్రాధాన్యమిస్తూ, మడకశిర, పుంగనూరు ఉప కాలవలకు నీరివ్వగలిగారని అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ తీరని ద్రోహాన్ని తలపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతామన్న నాటి సీఎం జగన్.. గంపెడు మట్టిని కూడా ఎత్తలేదని విమర్శించారు. జిల్లాపై చంద్రబాబుకు అభిమానమెక్కువ అని, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో హంద్రీనీవాకు రూ.3,700 కోట్లు మంజూరు చేశారని అన్నారు. పనుల పర్యవేక్షణకు స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబే వచ్చారంటే ఆయనకు ఈ ప్రాజెక్టు ఎంత ప్రీతిపాత్రమో అర్థం అవుతుందని అన్నారు. కూటమి పాలనలో జరుగుతున్న పనులతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారని వైసీపీ నాయకులను విమర్శించారు.

ఇక్కడికే రా..!

ఉరవకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు ద్రోహం చేసింది టీడీపీనే అని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆరోపించారు. హంద్రీనీవా పనులపై టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు బుధవారం తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్సీ కొనకొండ్ల నుంచి బుధవారం ఉరవకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు వైసీపీ కార్యకర్తలు, అనుచరులతో చేరుకున్నారు. రెండు గంటల వరకూ ఇక్కడే ఉంటానని, తన సవాల్‌ను స్వీకరించి హంద్రీనీవా శిలాఫలకం వద్దకు చర్చకు రావాలని ఫోన్‌ద్వారా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సమాచారం అందించారు. అయితే జీడిపల్లి రిజర్వాయర్ వద్దకే రావాలని ఇక్కడ ప్రత్యేకంగా మీ కోసం కుర్చీ కూడా ఏర్పాటు చేయించామని శివరామిరెడ్డికి కాలవ సమాధానమిచ్చారు. అనంతరం శివరామిరెడ్డి అనుచరులతో కలిసి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో ఉన్న హంద్రీనీవా శిలఫలకాల వద్దకు చేరుకున్నారు. అంతకుముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో 8ఏళ్లు హంద్రీనీవా కాలువలో తట్టెడు మట్టికూడా తీయలేదన్నారు. 40టీఎంసీల నీటిని టీడీపీ హయాంలో 5టీఎంసీలకు కుదించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2005లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హంద్రీనీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను జిల్లాకు తెచ్చింది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. వైసీపీ హయంలో హంద్రీనీవా కాలువను 6300క్యూసెక్కులకు పెంచుతూ రూ.9,318కోట్లు మంజూరు చేసి, టెండర్లు కూడా పిలిచామన్నారు. టీడీపీ నాయకులు హంద్రీనీవా వెడల్పు పేరుతో ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్‌తో జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రమణా యాదవ్, వైసీపీ నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, రమచంద్ర, తిప్పయ్య, రామాంజినేయులు, విజయ్, ముష్టూరు ఎర్రిస్వామి, మునెయ్య, దేవేంద్ర, హనుమంతు, బుసప్ప, ఆకుకూరల నాగరాజు, పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆలం తదితరులు

నేడు టీడీపీ జిల్లా మహానాడు

అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం టీడీపీ జిల్లా మహానాడు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే జిల్లా మహానాడుకు పార్టీ రాష్ట్ర నాయకులు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఏర్పాట్ల పరిశీలన

టీడీపీ జిల్లా మహనాడు వేదిక అయిన ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, రాయల్‌మురళి తదితరులు బుధవారం రాత్రి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కూచి హరి, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం పడింది. బెలుగుప్ప, కూడేరు, ఉరవకొండలో మోస్తరు వర్షం కురిసింది. అనంతపురం, యాడికి, పుట్లూరు, గుత్తి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి

వ్యర్థానికి అర్థం

సీఎం ఆలోచనలకు కలెక్టర్ కార్యరూపం..!
అరటి నార ఉత్పత్తులతో సంపద సృష్టికి శ్రీకారం
ఏడాదికి రూ.350 కోట్ల ఆర్జనే ధ్యేయంగా కార్యాచరణ
రైతులకు అదనపు ఆదాయంగా బయోవేస్ట్
మార్కెటింగ్ సౌకర్యం, ఎంఎస్ఎంఈ ద్వారా ప్రోత్సాహం



సీఎం చంద్రబాబుకు అరటి నారతో తయారు చేసిన టోపీని అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

అనంతపురం మే 21 (ఆంధ్రజ్యోతి): వ్యర్థంతో సంపద సృష్టించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు జిల్లా కలెక్టర్ కలెక్టర్ వినోద్‌కుమార్ కార్యరూపం ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలోనే అరటినారతో అందమైన వస్తువులు తయారీని ప్రోత్సహిస్తున్నారు. గతంలో పంట కోత కోసిన తర్వాత అరటి చెట్లను వృథాగా వదిలేసేవారు. అయితే అరటి నారతో టోపీ, హ్యాండ్‌బ్యాగ్‌లు, బ్యాగ్‌లు తదితర పర్యావరణ హితమైన ఉత్పత్తులను తయారు చేయించి, రైతుకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు కలెక్టర్ కార్యాచరణ సిద్ధం చేశారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌లకు జిల్లా కలెక్టర్ స్వయంగా అరటి నారతో తయారు చేసిన టోపీని బహూకరించారు. ఆ టోపీ తయారీ వెనుకున్న ఉద్దేశాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. అరటి బోదెల వేస్ట్‌తో సహజ సిద్ధమైన ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా

(మిగతా 6వ పేజీలో)

చెరువులను పటిష్ట పరచాలి

కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, మే21 (ఆంధ్రజ్యోతి): చెరువులను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. చెరువుల పటిష్ట, నవీకరణ పనులు చేపట్టాలన్నారు. ఆ మేరకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, గ్రౌండ్‌వాటర్ డీడీ తిప్పేస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రాము, సెంట్రల్ గ్రౌండ్‌వాటర్ బోర్డు అధికారి స్వరూప్‌కల్యాణ్, కేంద్రీయ జలసంఘం ఏడీ సంజీవ్ పాల్గొన్నారు.

పాడికి ప్రోత్సాహమేదీ..?

తగ్గిన పాల ధరలు...

నష్టపోతున్నామని రైతుల ఆందోళన



అమడగూరు (కదిరి), మే 21 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. సేద్యంలో తరచూ నష్టాలే వస్తుండటంతో చాలా మంది రైతులు పాడివైపు మళ్లారు. పశుపోషణతోనే జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. జీవనానికి భరోసా దొరికినా, పాలకు గిట్టుబాటు ధర రావడంలేదని పలువురు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే డెయిరీలు మూత పడ్డాయి. దీంతో పాడిరైతులు పాలను అమ్ముకోవాలంటే ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించక తప్పడంలేదు. దీంతో ప్రైవేటు నిర్వాహకులు ఇచ్చిన ధరనే రైతులు తీసుకోవాల్సి వస్తోంది.

పాడి పశువుల వివరాలు..		
పంచాయతీలు	ఆవులు	గేదెలు
అమడగూరు	770	52
జేకేపల్లి	507	80
తుమ్మల	1,181	51
చినగానిపల్లి	1,468	74
మహమ్మదాబాద్	491	56
పూలకుంట్లపల్లి	467	06
గుండువారిపల్లి	113	10
చీకిరేవుపల్లి	122	03
కసముద్రం	284	14
మొత్తం	5,403	346

తగ్గిన పాలధరలతో ఇబ్బందులు

ప్రభుత్వం పాలసేకరణ కేంద్రాలు నిర్వహించకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డెయిరీలు పెరిగినా, పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. పాలధరలు బాగా తగ్గించారు. గతంలో లీటర్ పాల ధర రూ.38నుంచి 40వరకు ఉండేది. ప్రస్తుతం లీటరుకు రూ.34మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు పాడి రైతుతు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మండల కేంద్రాల్లో ఏపీ డెయిరీ ఆధ్వర్యంలో పాలను సేకరించేవారు. ప్రస్తుతం వాటిని పునఃప్రారంభించి, పాడిరైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధరలు లేవు



నా వద్ద ఐదు పాడి ఆవులు ఉన్నాయి. ఆవులకు కావలసిన గడ్డిని ఒక ఎకరాలో సాగుచేశా. పాడిపైనే జీవనం. ఒకపూటకు 20లీటర్ల పాలు డెయిరీకి పోస్తున్నా. గతంతో పోల్చితే ఈఏడాది పాల ధరలు తగ్గాయి. పాలధరలు గతంలోలాగా వస్తే జీవనోపాధికి ఢోకా ఉండదు.

-మంజునాథ్, పాడిరైతు, కొక్కంటివారిపల్లి

గాడితప్పిన రెవెన్యూ పాలన

అందుబాటులో ఉండని సిబ్బంది

కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు



బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం

బొమ్మనహాళ్, మే 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పాలన గాడితప్పడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ పని కావాలన్నా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్‌కు డీ హిరేహాళ్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఇక్కడ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చేవారు.. అధికారులు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. తమ భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని కొందరు రైతులు నెలల తరబడి తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుతం రైతులు బ్యాంకు రుణాలు రెన్యువల్ కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారు. కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బంది అందుబాటులో ఉండట్లేదు. తాము ఎక్కడుంటే అక్కడికే రావాలని వారు చెబుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటే.. తహసీల్దార్ ఉండరు. తహసీల్దార్ సంతకం కోసం అలస్యం అవుతోందని రైతులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు తప్పించి, తమన సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆరు నెలలుగా తిరుగుతున్నా



సింగానహళ్లి పొలం 119, 128, 132బి, 132సి సర్వే నంబర్లలో ఎకరా భూమి ఉంది. అందుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్, 1బీ ఆన్‌లైన్‌లో నా పేరునే ఉన్నాయి. ఆరు నెలల క్రితం ఆన్‌లైన్‌లో 0.60 ఎకరా భూమిని తొలగించారు. ఆ భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించారు. దీని కోసం ఆరు నెలలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు నా పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలి.

-కెంచప్ప, రైతు, సింగానహళ్లి

సిబ్బంది కొరత ఉంది



రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఆర్ 2, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ లేరు. ఉన్నవారితో పని చేస్తున్నాం. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తున్నాం. కొన్ని అలస్యం కావచ్చు. వాటిని పరిష్కరిస్తున్నాం. రైతులు నేరుగా నన్ను కలిసి సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

-మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

99.6 శాతం పాస్

డిగ్రీ మెగా సప్లిమెంటరీ ఫలితాలు అదుర్స్

పరీక్షలు రాసిన 3,665 మంది విద్యార్థులు

16మంది మాత్రమే ఫెయిల్

ఫలితాలు విడుదల చేసిన ఎస్కేయూ వీసీ అనిత



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షల్లో 99.6 శాతమంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత.. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో కలిసి బుధవారం ఫలితాలు విడదల చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. డిగ్రీలో సెమిస్టర్ విధానానికి ముందు ఇయర్‌వైజ్ పరీక్షలు నిర్వహించేవారన్నారు. వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ నిర్వహించలేదన్నారు. దీంతో వేలాదిమంది విద్యార్థులు డిగ్రీ పూర్తిచేయలేక ఉద్యోగాలు పొందలేక, పోటీ పరీక్షలకు అర్హతలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో 1994 నుంచి 2015 వరకు డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ వార్షిక పరీక్షల విధానంలో ఫెయిలైన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ నిర్వహించామన్నారు. మొత్తం 3,655 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 3,639 మంది పాస్ అయినట్లు తెలిపారు. 16మంది విద్యార్థులు మాత్రమే ఫెయిలవడంతో 99.6 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు. ఫలితాలను మనబడి, స్కూల్స్9 వెబ్‌పోర్టల్‌లో ప్రదర్శించామన్నారు. ఫెయిలైన విద్యార్థులు రీవెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ.500 చొప్పున ఈనెల 22 నుంచి చెల్లించాలని సూచించారు. డిగ్రీ హానర్ ప్రథమ సెమిస్టర్ పరీక్షల్లో 8,265 మంది విద్యార్థులకుగాను 4,739 మంది పాస్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ సంచాలకుడు ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ డాక్టర్ లోకేషన్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ రామగోపాల్, అధికారులు సాయిశివ, మారుతి పాల్గొన్నారు.

గోకులం కట్టి..

అప్పు చేసి.. షెడ్డు నిర్మాణం

పాడినే అమ్ముకున్నాడు..!

వెంటనే బిల్లులిస్తామని అధికారుల హామీ

నెలలైనా అందించని వైనం

పాడిని అమ్మి.. రుణం చెల్లించిన రైతు



నగరూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

యాడికి, మే 21(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయి ఐదునెలలైనా నేటికీ బిల్లులు అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాడిరైతుల సంక్షేమం కోసం గోకులాలను ఏర్పాటు చేసింది. మండలవ్యాప్తంగా 32 మంది పాడిరైతులు గోకులాలను నిర్మించుకున్నారు. ఒక్కో గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2.70 లక్షలు బిల్లులు మంజూరు కావాల్సిఉంది. మండలవ్యాప్తంగా రూ.66.24 లక్షలు చెల్లించాల్సి ఉంది. గోకులాల నిర్మాణ సమయంలో బిల్లులకు ఢోకా లేదనీ, పనులు పూర్తి చేయడమే ఆలస్యం, వెంటనే చెల్లిస్తామని అధికారులు చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. దీంతో అప్పులు చేసి షెడ్లను నిర్మించుకున్నామని పాడిరైతులు తెలిపారు. సంక్రాంతి పండుగరోజు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు అట్టహాసంగా గోకులాలను ప్రారంభించి ఫొటోలకు ఫోజులిచ్చారనీ, బిల్లుల విషయం మాత్రం పట్టించుకోవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని అధికారులు చెబుతున్నారని వారు వాపోతున్నారు. వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో వడ్డీకి అప్పులు తెచ్చి గోకులాలు నిర్మించామనీ, ఇప్పుడు అధికారులు చేతులెత్తేస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని, గోకులం షెడ్ల బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

యాడికి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పాడి రైతు రెండు గేదెలను మేపుతుండేవాడు. వాటి పాలు అమ్మి, జీవనం సాగిస్తుండేవాడు. గోకులం షెడ్డు కట్టుకోవాలనీ, నిర్మాణం అలా పూర్తవగానే.. ఇలా.. బిల్లులు చెల్లిస్తామని అధికారులు నమ్మబలికారు. జీవనాధారమైన పాడి పశువులకు నీడ ఏర్పాటు చేయడం మంచిదే కదా అనుకున్నాడు రైతు. తన వద్ద డబ్బు లేకున్నా.. ఇతరుల వద్ద రూ.2 లక్షలకు పైగా అప్పు తెచ్చి, గోకులం షెడ్డు కట్టుకున్నాడు. నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులు వెంటపడ్డారు. షెడ్డు నిర్మాణం పూర్తవగానే దాని వద్ద అధికారులు ఫొటోలు దిగారు. వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. నెలలు గడుస్తున్నా.. మంజూరు చేయలేదు. బిల్లులు అడిగితే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో పాడి రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. బిల్లులు వస్తే కట్టుకుందామని అప్పులు తెచ్చి, షెడ్డు నిర్మించుకున్నాడు. బిల్లులు రాక అయోమయంలో పడ్డాడు. అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేశారు. ఏ మార్గమూలేక పాడి పశువులనే అమ్మేసి, అప్పు కట్టాడు. అలా.. అధికారుల నిర్వాకంతో ఏ పాడి పశువుల కోసమైతే గోకులం షెడ్డు కట్టాడో.. అందుకు చేసిన అప్పు తీర్చేందుకు వాటినే అమ్ముకోవాల్సి వచ్చింది. పాపం.. జీవనాధారం కోల్పోయాడు పాడి రైతు.

వెంటనే బిల్లులు చెల్లిస్తామంటేనే షెడ్డు కట్టుకున్నా



గోకులం షెడ్లను కట్టుకునేది ఆలస్యం వెంటనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు నమ్మబలకడంతో అప్పుచేసి పనులను వేగవంతంగా పూర్తిచేశా. సంక్రాంతి పండుగ రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి అట్టహాసంగా ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరుకాలేదు. గోకులం బిల్లులు వెంటనే మంజూరు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

-వేణు, పాడిరైతు, నగరూరు గ్రామం

ఒత్తిడి చేసి.. పనులు పూర్తి చేయించారు..



గోకులం షెడ్డు కట్టేటపుడు అధికారులు వెంటపడి పనులు పూర్తి చేయించారు. నిర్మాణ సమయంలో డబ్బుల్లేక అప్పు చేయాల్సి వచ్చింది. పనులు పూర్తయి ఐదునెలలవుతున్నా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గోకులం షెడ్ల బిల్లులు వెంటనే మంజూరు చేయాలి.

-లోకేశ్, పాడిరైతు, పిన్నేపల్లి

నిధులు మంజూరు కావాల్సి ఉంది



మండలంలో 32 గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. నిధులు రాగానే బిల్లులు చెల్లిస్తాం.

-మద్దిలేటి, ఏపీఓ, యాడికి మండలం

వ్యర్థానికి అర్థం

(ఐదోపేజీ తరువాయి)

రైతుకు కలిగే ఆర్థిక ప్రయోజనాలను వారికి కలెక్టర్ వివరించారు. ఈ వినూత్న ఆలోచనకు గవర్నర్, సీఎం, మంత్రిల నుంచి కలెక్టర్‌కు ప్రశంసలు అందాయి.

హార్టికల్చర్ కాంక్లేవ్‌తో ఆలోచన

జిల్లాలో 12వేల హెక్టార్లలో అరటి పంట సాగవుతోంది. పంట కోత తర్వాత బయోవేస్ట్‌ను వినియోగించడం ద్వారా పర్యావరణ హితమైన పద్ధతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆలోచించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహణ ద్వారా జాతీయ స్థాయిలో ఒక గుర్తింపు వచ్చింది. హార్టికల్చర్ కాంక్లేవ్ తర్వాత ఆయన మదిలో మెదిలిన ఆలోచనతోనే అరటినారతో టోపీలు, బ్యాగ్‌లు, డెకోరేటివ్ ఉత్పత్తుల తయారీ కోసం జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.



మంత్రి నారా లోకేశ్‌కు అరటి నారతో తయారు చేసిన బ్యాగ్‌ను అందజేస్తున్న కలెక్టర్ (ఫైల్)





అరటి నారతో తయారు చేసిన టోపీ, బ్యాగ్

స్వయం ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమ

అరటి నారతో టోపీలు, బ్యాగ్‌లు తదితర అందమైన వస్తువుల తయారీని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం సంకల్పించింది. డీఆర్‌డీఏ, వెలుగు, గ్రామైక్య సంఘాలు, మెప్మా స్వయంసహాయక సంఘాలు, నిరుద్యోగ యువత, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తల ద్వారా అరటి నారతో అందమైన వస్తువులను తయారుచేయించి, మార్కెటింగ్ చేసేవిధంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోంది. తద్వారా కరువు జిల్లా రైతాంగానికి అదనపు ఆదాయం, నిరుద్యోగ మహిళలు, యువతకు స్వయం ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ వినూత్న ఆలోచనకు కలెక్టర్ శ్రీకారం చుట్టారు.

కలెక్టర్ ఏమంటున్నారంటే..!

వ్యర్థమైన అరటిబోదెలతో పర్యావరణ హితమైన ఉత్పత్తులు తయారు చేసి రైతు, మహిళలు, యువత, పారిశ్రామిక ఔత్సాహికులకు ఆదాయం చేకూర్చాలనే ఆలోచనలపై 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌తో వచ్చిన ఆలోచననే ప్రస్తుతం జిల్లాలో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. అందులో భాగంగానే అరటి నారతో టోపీలు, బ్యాగ్‌లు, షర్టులు, చీరలు, పర్సులు, డెకోరేటివ్ ఉత్పత్తులు, గిఫ్ట్ బాక్కులు తయారు చేసి స్థానిక, దేశీయ మార్కెట్‌లోకి తీసుకువెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళా సంఘాలకు, పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం. అరటి నార ఉత్పత్తుల తయారీని జిల్లాలో ఒక కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

12వేల హెక్టార్లలో అరటి సాగు

జిల్లాలో 12వేల హెక్టార్లల్లో అరటి సాగవుతోంది. పంట విస్తీర్ణం పెంచడంతోపాటు అరటి గెలల కోత తర్వాత ఏడాదికి సుమారు 7.2 లక్షల టన్నుల అరటి బయోమాస్ వేస్ట్ ఉంటోంది. ఒక టన్ను బయోమాస్ వేస్ట్ ద్వారా దాదాపు 20 కేజీల అరటి నారను తయారు చేయవచ్చు. ఈ విధంగా ఏడాదికి 14వేల టన్నులకుపైగా అరటినారను జిల్లాలో తయారు చేయవచ్చు. ఈ అరటి నారను ఉపయోగించి, 7 కోట్ల అందమైన టోపీలు, బ్యాగ్‌లు, ఇతర విలువైన వస్తువులను తయారు చేయవచ్చు. తద్వారా రైతులు, మహిళలు, గ్రామీణ యువతకు ఏడాదికి రూ.350 కోట్ల అదనపు ఆదాయ వనరులు కల్పించవచ్చు. అరటి నార ఉత్పత్తుల తయారీ కుటీర పరిశ్రమను రూ.2 లక్షల పెట్టుబడితో ఎవరైనా ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేయవచ్చు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలతో సెమి ఆటోమేటిక్, రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలతో ఫుల్లీ ఆటోమేటిక్ పరిశ్రమను ఏర్పాటు చేసి ఏడాదికి 25 శాతం దాకా లాభాలు ఆర్జించవచ్చు. అరటి నార ఉత్పత్తుల తయారీకి ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం ఆగ్రో పరిశ్రమ, ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చే రాయితీలను వర్తింపజేస్తోంది. జాప్యంలేకుండా అన్ని అనుమతులు మంజూరు చేస్తాం. అరటి నార ఉత్పత్తుల తయారీకి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

చీనీ @ రూ.50వేలు

యల్లనూరు, మే21(ఆంధ్రజ్యోతి): చీనీ ధరలు రైతుల్లో ఉత్సాహం నింపుతున్నాయి. వారం క్రితం వరకు నేలచూపులు చూసిన చీనీ ధరలు ఒక్కసారిగా స్పీడందుకున్నాయి. టన్ను ఏకంగా రూ.50వేలు ధర పలుకుతోంది. కాయ నాణ్యతను బట్టి అంతకంటే ఎక్కువ రేటు పెట్టేందుకు కూడా వ్యాపారులు ముందుకొస్తున్నారని రైతులు చెబుతున్నారు. మండలంలోని పాతపల్లి, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి, యల్లనూరు, పెద్దమల్లేపల్లి, దుగ్గుపల్లి, వెంకటాంపల్లి పరిధిలో చీనీ ఎక్కువగా సాగు చేస్తున్నారు.వారంరోజుల క్రితం వరకు రూ.20వేల నుంచి 30వేల వరకు ఉన్న ధర పెరుగుతూ పోతోంది. ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, మే21(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు-బీదర్ (వయా గుంతకల్లు) మధ్య ఆరు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (నం.06589) ప్రత్యేక రైలు ఈనెల 22, 24, 26 తేదీల్లో బెంగళూరు నుంచి రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15 గంటలకు బీదర్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.06590) ఈ నెల 23, 25, 27 తేదీల్లో బీదర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 3 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, శంషాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖాధికారి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రథమ సంవత్సరంలోనూ, ఇంటర్మీడియేట్ (ఎంపీసీ), రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సులు పాస్ అయిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలోనూ ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ప్రవేశాలు పొందిన వారికి నెలకు రూ.2500 స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. బీటెక్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా చేరవచ్చన్నారు. దేశవ్యాప్తంగా హ్యాండ్‌లూమ్ ఇనిస్టిట్యూట్స్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 9866169 908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని కోరారు. www.iihtvgr.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ప్రతిభా పురస్కారాలకు...

అనంతపురం క్లాక్‌టవర్, మే 21(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కులమతాలకు అతీతంగా ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక కోర్టురోడ్డులోని ఏపీఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో 550, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థినీవిద్యార్థులు ఇన్‌స్పైర్ ప్రతిభా పురస్కారాలకు అర్హులన్నారు. ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9985012181, 8885012181, 7730814646 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంజనీపుత్రా.. అభయప్రదాతా..

నేడు హనుమజ్జయంతి

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

అనంతపురం కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): అంజనీపుత్రుడు, శ్రీరామచంద్రుడి పరమ భక్తుడైన హనుమంతుడి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించనుకోనున్నారు. వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. హనుమజ్జయంతి రోజున ఆలయాలకు వెళ్లి పావనసుతుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు, పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజున పలువురు అన్నదానాలు చేస్తే.. మరికొందరు ఉపవాసాలుండి హనుమంతుడిని ఆరాధిస్తుంటారు. హనుమజ్జయంతి వేడుకలకు జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో వెలసిన భక్తాంజనేయస్వామి, నగరశివారు సోములదొడ్డిలోని అభయాంజనేయస్వామి, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, రెవెన్యూ కాలనీ రామాలయం, మారుతీనగర్‌లోని పంచముఖాంజనేయస్వామి, పాతూరు వ్యాసరాజమఠం ఆవరణలోని మూలాంజనేయస్వామి, కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి, పాతూరు మార్కెట్‌వద్ద గల మండి ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, షేమియానాలు ఏర్పాటు చేసారు.

హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నుంచే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండోరోజు బుధవారం భక్తాంజనేయ స్వామి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం వరకూ ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు.



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



విశేష అలంకరణలో భక్తాంజనేయ స్వామి



విద్యుద్దీపాలంకరణలో హౌసింగ్ బోర్డు భక్తాంజనేయస్వామి దేవాలయం

వైద్యం పేరిట దోపిడీ

సవీరా సహా చాలా ఆస్పత్రుల్లో దందా

- నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి
- ఆర్డీటీని కాపాడుకునేందుకు కలిసి పోరాడుదాం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో వీటిపైనే ప్రధాన చర్చ
- ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం ఏకగ్రీవ తీర్మానం
- చైర్‌పర్సన్ చాంబర్‌లో జగన్ ఫొటోపై ఎమ్మెల్యేల అసహనం

అనంతపురం విద్య, మే 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలను నిలువునా దోచుకుంటున్నాయని, వాటిని నియంత్రించాలని జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సవీరా ఆసుపత్రి దోపిడీని అరికట్టాలని అన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ విషయంలో సభ్యులు ఏకతాటిపైకి వచ్చి, పోరాడాలని నిర్ణయించారు. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆర్డీటీ ఆసుపత్రులు సమస్యల్లో ఉన్నందున డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ అప్రమత్తంగా ఉండాలని, అక్కడి నుంచి వచ్చే కేసులను వెంటనే టేకప్ చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో జగన్ ఫొటో పెట్టుకోవం, సీఎం చంద్రబాబు ఫొటోకు ప్రాధా న్యం లేకపోవడంపై ఎమ్మెల్యేలు రాజు, దగ్గుబాటి, అమిలినేని మండిపడ్డారు. ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చ లేకుండా.. ఇలా జడ్పీ సర్వసభ్య సమావేశం బుధవారం రెండు గంటల్లో మమ అనిపించారు.

వైద్యంపై చర్చ

సభలో మొదట వైద్య శాఖపై చర్చ జరిగింది. ఆరోగ్యశ్రీ డబ్బులు వేయిస్తామంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలకు వలవేస్తున్నారని, దీన్ని నివారించాలని బుక్కరాయసముద్రం జడ్పీటీసీ కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే వైద్యం అందేలా జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ లేదని, వెంటనే ఏర్పాటు చేయాలని విడపనకల్లు జడ్పీటీసీ కోరారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మడకశిర ఎమ్మెల్యే రాజు అధికారులకు సూచించారు. జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు, మందుల కొరత ఉందని అనంతపురం రూరల్ జడ్పీటీసీ అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, అన్ని కేసులు కర్నూలు, తిరుపతి, బెంగళూరు రెఫర్ చేస్తున్నారని, అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. వైసీపీ హయాంలో అధ్వానంగా ఉండేదని, తమ ప్రభుత్వం వచ్చాక తాను తరచూ విజిట్ చేస్తున్నానని, ఆసుపత్రి మెరుగుపడిందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి అన్నారు. ఓపీకి రోజుకు 2500 మంది వరకూ రోగులు వస్తున్నారని, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. సూపరింటెండెంట్ తరచూ రాత్రిళ్లు విజిట్ చేయాలని, వార్డులు, నర్సుల పనితీరు పరిశీలించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. వీటీపీ తండా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత గురించి సభ దృష్టికి ఐదుసార్లు తెచ్చినా పట్టించుకోవడం లేదని వజ్రకరూరు ఎంపీపీ అన్నారు. కుక్కకాటుకు మందు దొరకడం లేదని అన్నారు. దీంతో 'డాక్టర్లను ఇస్తారా ఇవ్వరా..? ఎన్నిసార్లు అడగాలి?' అని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శెట్టూరు పీహెచ్‌సీలో సిబ్బంది అసలు ఉండటం లేదని ఆ మండల జడ్పీటీసీ అన్నారు. సభలో ఫొటోలు చూపించారు.



వేదికపై జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా జేసీ

దోపిడీని ఆపండి..

అనంతపురంలో సవీరా ఆసుపత్రిలో దోపిడీ పెరిగిందని, ప్రాణం మీదకు వచ్చిందని బెదిరించి వేలాది రూపాయలు దోచేస్తున్నారని శెట్టూరు జడ్పీటీసీ సభ దృష్టికి తెచ్చారు. చాలా ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ ఎక్కువైందని, అరికట్టాలని కోరారు. జడ్పీటీసీ చెప్పింది వాస్తవమేనని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అన్నారు. 'కొన్ని రోజులు ఉంచుకుంటారు. ఏం ట్రీట్‌మెంట్ ఇస్తున్నారో ఎవరికీ తెలియదు. రోగులను సవీరా ఆసుపత్రికి రెఫర్ చేయడం ప్లాన్ ప్రకారం జరుగుతోంది. గద ఐదేళ్లలో ఇదే తంతు జరిగింది. ఇలాంటివి కట్టడి చేయాలి' అని కోరారు. కళ్యాణదుర్గం, బత్తలపల్లి, కణేకల్లు ఆర్డీటీ ఆసుపత్రులు మూతపడే పరిస్థితి ఉందని కంబదూరు జడ్పీటీసీ అన్నారు. ఆత్మకూరు ఎంపీపీ స్థానిక పీహెచ్‌సీ సమస్యలను, వైస్ చైర్మన్ సైతం నార్పల పీహెచ్‌సీ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. శెట్టూరు పీహెచ్‌సీలో సిబ్బంది నిర్లక్ష్యం గురించి విచారించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సవీరా ఆసుపత్రిపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గైనకాలజిస్టులు, స్పెషలిస్టు డాక్టర్ల కొరత ఉందని, అర్హులు దరఖాస్తు చేసుకుంటే ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ ప్రకటించారు.



హాజరైన సభ్యులు

ఆర్డీటీని కాపాడుకుందాం..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొందరు జడ్పీటీసీలు ఆర్డీటీ సేవలను ప్రస్తావిస్తూ, ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ చేసేలా అండగా నిలవాలని సభను కోరారు. దీనికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే స్పందిస్తూ, 2023లోనే ఈ సమస్య ఉత్పన్నమైందని అఅన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు 2024లో లేఖ రాశామని అన్నారు. ఆర్డీటీని నిలబెట్టుకునేలా అందరూ అడుగేయాలని కోరారు. సభ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపుతామని జడ్పీ చైర్‌పర్సన్ ప్రకటించారు.

- ఉపాధి పనుల్లో అక్రమాలను కొందరు జడ్పీటీసీలు లేవనెత్తారు. పనిచేసిన కూలీలకు రెట్టింపు సంఖ్యలో రికార్డుల్లో నమోదు చేస్తున్నారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని కొందరు జడ్పీటీసీలు కలెక్టర్‌ను కోరారు. భూమి చుక్కల్లో ఉన్నా, రైతులు సాగులో ఉంటే అడంగల్ ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్డీటీ సమస్య, ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ మినహా పెద్దగా చర్చలు సాగలేదు. సమావేశానికి మెజార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మండలి సభ్యులు గైర్హాజరయ్యారు. జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగన్ ఫొటో తీసేయండి..!

జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో వైసీపీ అధినేత జగన్ ఫొటో కనిపించడంతో టీడీపీ ఎమ్మెల్యేలు ఫైర్ అయ్యారు. అధికారులకు చెప్పి వెంటనే జగన్ ఫొటో తీసేయించారు. సీఈఓ రామచంద్రారెడ్డిని చైర్‌పర్సన్ చాంబర్‌కు పిలిచి... ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి, అమిలినేని నిలదీశారు. 'మీరు సీఈఓనేనా..? జగన్ ఫొటో పెటొచ్చా..? సీఎం చంద్రబాబు ఫొటోను రెస్ట్ రూం వద్ద పెడతారా?' అని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో సైతం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఫొటో తీసేయాలని చైర్‌పర్సన్‌కు తాము చెప్పామని, వెంటనే తీసేయిస్తామని సీఈఓ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో 'జడ్పీ చైర్‌పర్సన్ అయితే.. జగన్ ఫొటోను తన ఇంట్లోలో లేదా పూజ గదిలోనూ పెట్టుకోమనండి.. మాకు అభ్యంతరం లేదు' అంటూ సీఈఓపై అసహనం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ చాంబర్ నుంచి జగన్ ఫొటో తీసేయించారు. సీఎం చంద్రబాబు ఫొటోను జడ్పీ చైర్‌పర్సన్ కుర్చీ వద్ద గోడపై పెట్టించారు.



సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు

క్రైం కార్నర్

దొంగ చేతికి తాళం..!



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

గుంతకల్లుటౌన్, మే21(ఆంధ్రజ్యోతి): బయటకు వెళ్లేటపుడు ఇంటికి తాళం వేస్తుంటారు. కొంతమంది మాత్రం తాళం చెవిని డోర్ వద్దో, కిటికీలోనో, బాక్సు కిందో ఉంచి వెళ్తుంటారు. కుటుంబంలోని మరికొందరు ఇంటికి వచ్చే అవకాశం ఉంటే ఇలా చేస్తుంటారు. ఇది సరికాదు. ఇలా చేయడం ద్వారా దొంగ చేతికి తాళం ఇచ్చినట్లే. ఇందుకు నిదర్శనమే గుంతకల్లులో జరిగిన చోరీ. పట్టణంలోని జగ్జీవన్ రామ్ కాలనీలో ఫక్రువలి కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 17వ తేదీన ఫక్రువలి ఉదయం చెరకు బండికి, అతడి భార్య బషీరున్నీషా చర్చి స్కూల్‌లో పనికెళ్లారు. వారి ఇద్దరు కుమారులు కూడా పనులకెళ్లారు. వారి కోడలు, కూతురు ఇంట్లో ఉన్నారు. ఫక్రువలి మనవడికి టీకా వేయించేందుకు అతడి కోడలు, కూతురు ప్రభుత్వాస్పత్రికెళ్లారు. ఇంటికి తాళం వేసి, అందుకు సంబంధించిన తాళం చెవిని కిటికీ వద్దనున్న డబ్బా కింద పెట్టి వెళ్లారు. కుటుంబికులు ఎవరైనా ఇంటికొస్తే తాళం తీసుకునే అవకాశం ఉంటుందనుకున్నారు. అదే.. దొంగకు గోల్డెన్ చాన్స్ అయింది. ఈ మొత్తం వ్యవహారాన్ని పట్టణానికే చెందిన మేస్త్రీ పనిచేసే మోకా శ్రీనివాస్ గమనించాడు. వారు ఆస్పత్రికి వెళ్లగానే.. ఎంచక్కా.. డబ్బా కింద పెట్టిన తాళం చెవి తీసుకుని, ఇంట్లోకి దర్జాగా వెళ్లాడు. బీరువా తాళాలు తీసుకుని, దానిని తెరిచి, అందులోని 8 తులాల బంగారు ఆభరణాలను తీసుకుని, తాపీగా వెళ్లిపోయాడు. కాసేపటికి ఇంటికొచ్చిన ఫక్రువలి కుటుంబికులు తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి, చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా మోకా శ్రీనివాస్‌ను బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు (నెక్లెస్, లాంగ్ చైన్, జత కమ్మలు, గొలుసు, చిన్నపిల్లలకు చెందిన మూడు ఉంగరాలు) స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు ఛేదింపు వివరాలను వెల్లడించారు. చోరీ అయిన సొత్తు రికవరీ అవడంతో ఫక్రువలి కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ఈ చోరీని బట్టి బయటకు వెళ్లేటపుడు ఇంటికి తాళం వేసి, తాళాలు బయట కిటికీలోనో, తలుపు గ్రిల్‌లోనో, డబ్బాల కిందనో పెట్టేసి వెళ్తే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లే. బీ కేర్ ఫుల్.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి



జబ్బార్ మృతదేహం

పెద్దవడుగూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి గ్రామసమీపంలో కారులో వివాహానికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడిపత్రికి చెందిన జబ్బార్ (49) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు తాడిపత్రి పట్టణంలోని గాజులపాలెంకు చెందిన పెళ్లిబృందం వజ్రకరూరు మండలంలో జరుగుతున్న వివాహానికి బయల్దేరింది. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలో పెళ్లికుమారుడు రాజేష్‌తోపాటు శ్రీనివాసులు, సరోజ, ఉమాదేవి, నారాయణమ్మ స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి పరిశీలించారు.

పట్టుదలతోనే లక్ష్యసాధన

- మంత్రి సవిత
- ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటేనే లక్ష్యాన్ని సాధించగలమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలనీ, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం మినీ మహానాడు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని సూచించారు. అనంతరం పదో తరగతిలో 550 మార్కులు సాధించిన 84 మందికి, ఇంటర్‌లో 900కిపైగా మార్కులు పొందిన 94 మంది విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు, సర్టిఫికెట్లు భద్రపరచుకునేందుకు ఫైల్, షీల్డ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్, ఎంఈఓ సుధాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, హెచ్ఎం నాగార్జునుడు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల సేవామందిరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వినోద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఒకటి నుంచి పదో తరగతి వరకు కల్పిస్తున్న ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని అంధులు అర్హులన్నారు. వారి పిల్లలను చేర్పించేందుకు ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు 40శాతం అంధత్వమున్న సదరం సర్టిఫికెట్, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. వివరాలకు 8008889815, 08556-297796 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

విత్తన పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం జేడీఏ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఖరీఫ్‌లో విత్తన పంపిణీతో పాటు అవసరమైన అన్నిరకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలను బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేఎన్టీయూఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ శివకుమార్, ఏసీఈలు ప్రొఫెసర్ శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

సిఫార్సుల వేట..!

- వ్యవసాయ శాఖలో అనుకూల స్థానాల కోసం పాట్లు
- ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నం
- జిల్లా కేంద్రంతోపాటు సమీప మండలాలపైనే దృష్టి
- ఉమ్మడి జిల్లాను దాటిన సిఫార్సులు



అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీల పర్వం రసవత్తరంగా సాగుతోంది. కొందరు ఏఓలు, ఏడీఏలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలు నచ్చిన స్థానాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు సమీప మండలాలపైనే కొందరు ఏఓలు దృష్టి సారించినట్లు సమాచారం. ఐదేళ్ల కాల పరిమితి దాటిన అధికారులు, సిబ్బందికి బదిలీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇదే క్రమంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తికాని అధికారులు, ఉద్యోగులు కూడా ఇతర ప్రాంతాలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పలువురు ఏడీఏలు, ఏఓలు తమకు నచ్చిన స్థానాలకు వెళ్లేందుకు ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు ఏఓలు ఒకే స్థానాన్ని ఆప్షన్‌గా ఇచ్చి ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు రెండు, మూడు స్థానాలు ఆప్షన్‌గా ఇచ్చి ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ముఖ్యంగా జిల్లా కేంద్రంతోపాటు సమీప మండలాల ఏఓ, ఇతర కేడర్లలోని పోస్టులకు పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. కిందిస్థాయి సిబ్బంది తమకు అనుకూలమైన స్థానాల కోసం రాజకీయ నాయకులతోపాటు వ్యవసాయ సంఘాల నాయకులను కలిసి విన్నవించుకుంటున్నారు. ఇదేక్రమంలో ఐదేళ్లు పూర్తికాని అధికారులు తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు అధికారులు ఇప్పటికే ఆయా స్థానిక ప్రజాప్రతినిధుల వద్ద తమదైన రీతిలో 'వెరీ గుడ్' మార్కులు కొట్టేసినట్లు చర్చ సాగుతోంది. దీంతో ఆయా స్థానాలకు ఇతర అధికారులు ఆప్షన్ ఇవ్వకుండా మిన్నకుండిపోయినట్లు చర్చ సాగుతోంది.

రాష్ట్రస్థాయి నుంచే..

బదిలీల సమయంలో ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తప్పనిసరిగా మారింది. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను కొందరు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నేరుగా సంప్రదిస్తుండగా.. మరికొందరు తమకు అనుకూలమైన ద్వితీయ శ్రేణి నాయకులను వెంటబెట్టుకొని సిఫార్సులు చేయించుకుంటున్నట్లు సమాచారం. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో పనిచేసే ఓ అధికారి జిల్లా కేంద్రంలో పోస్టింగ్ కోసం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులను దాటుకుని... ఏకంగా రాష్ట్రంలో కీలక మంత్రి ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులకు సిఫార్సు చేయించినట్లు సమాచారం. ఆయన చేయించిన సిఫార్సు ప్రస్తుతం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశమైంది. జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులను నేరుగా కలవకుండా అంతస్థాయిలో సిఫార్సు చేయించడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ జోరుగా సాగుతోంది.

నేడు పరిశీలన

జేడీఏ ఆధ్వర్యంలో బదిలీలు ఖరారు చేసే పలు కేడర్ల ఉద్యోగులు, సిబ్బంది దరఖాస్తుల పరిశీలన గురువారం చేపట్టనున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు అనంతపురం జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, మినిస్టీరియల్ స్టాఫ్ అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లు తదితర సిబ్బంది బదిలీల దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏఈఓల దరఖాస్తుల పరిశీలన ఉంటుంది.

26న సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలకు..

సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చేందుకు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలదాకా గడువు విధించారు. ఈనెల 26న జోన్-4 పరిధిలోని అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జల్లాలకు సంబంధించి సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏల జాబితా పరిశీలన అనంతపురం జేడీఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆయాజిల్లాల జేడీఏలు, అధికారులు హాజరుకానున్నారు. పరిశీలన తర్వాత ఆ జాబితాను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

కేసులకు భయపడేది లేదు

- వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



సమన్వయకర్తలతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

అనంతపురం క్రైం, మే21(ఆంధ్రజ్యోతి): ఎవరిపై కేసులు పెట్టినా భయపడేది లేదనీ, ధైర్యంగా ఎదుర్కొంటామని రాజంపేట ఎంపీ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి అన్నారు. నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని ఓ హోటల్‌లో బుధవారం ఎన్నికల పరిశీలకులు రమేష్‌రెడ్డి, నరేష్ కుమార్‌రెడ్డి, జిల్లాల అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి, ఉషశ్రీచరణ్‌తో కలిసి ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు. కేసులతో అందరినీ భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నాయకుల నుంచి కార్యకర్తల వరకు ఎవరిపై కేసు పెట్టినా భయపడాల్సిన పనిలేదన్నారు. ధైర్యంగా పోరాటం చేద్దామన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేద్దామన్నారు. సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సర్పంచ్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, వై.వెంకట్రామిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, రంగయ్య, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దీపిక, మక్బుల్, ఈరలక్కప్ప పాల్గొన్నారు.

కేఎస్ ఆర్టీసీలోనూ రాయితీ ఇవ్వండి

- కర్ణాటక రవాణాశాఖ మంత్రికి ఆర్టీసీ జోనల్ చైర్మన్ వినతి



కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు బుధవారం కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, కేఎస్ ఆర్టీసీ ఎండీ నందినిదేవిలను వారి కార్యాలయాల్లో కలిశారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరల్లో 25శాతం రాయితీ కల్పించినట్లుగా ఏపీలో తిరిగే కేఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనూ 25శాతం రాయితీ కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ ఏపీలో తిరిగే కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ కల్పించకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వినతులు వస్తున్నాయని, వారి కోరిక మేరకు ఏసీ సర్వీసులు సహా అన్నిరకాల సర్వీసుల్లోనూ రాయితీ కల్పించాలని కోరారు.

న్యూస్ బాక్స్

నాణ్యమైన విత్తనకాయలు సరఫరా చేయాలి: ఏడీఏ

అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాలకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు మాత్రమే సర ఫరా చేయాలని అనంతపురం ఏడీఏ రవి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక గుత్తి రోడ్డులోని విజయ ఆగ్రో సీడ్స్ ప్రాసె సింగ్ యూనిట్‌లో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్‌తోపాటు నాణ్యతను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గడువులోగా రీసర్వే పూర్తిచేయాలి: ఆర్డీఓ

చెన్నేకొత్తపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా రీసర్వేను పూర్తి చేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేశ్ సిబ్బందికి సూచించారు. ఆయన బుధవారం మండలంలోని మేడాపురం గ్రామంలో జరుగుతున్న భూరీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

మేయర్ చాంబర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల ఏర్పాటు


ఫొటోలు ఏర్పాటు చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం క్రైం, మే21(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను టీడీపీ నాయకులు బుధవారం ఏర్పాటు చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికారప్రతినిధి లక్ష్మీనరసింహ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సరిపూటి శ్రీకాంత్, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, ఎస్సీ సెల్ నాయకుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. నగర ప్రథమ పౌరుడైన తన చాంబర్‌లోకి టీడీపీ నాయకులు ఎలా చొరబడతారని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. మేయర్ చాంబర్‌లో చొరబడి సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు పెట్టడాన్ని మేయర్ తప్పుబట్టారు. ఫొటోలు పెట్టాలంటే కమిషనర్‌ను సంప్రదించాలన్నారు. జడ్పీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేల తీరును ఖండిస్తున్నామని, చైర్‌పర్సన్ చాంబర్‌లోకి వారు ఎలా వెళ్తారన్నారు.

గవర్నర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

● జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి హాజరై విద్యార్థులకు సందేశాత్మక దిశా, నిర్దేశం చేసినందుకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలని జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. బుధవారం జేఎన్టీయూ స్నాతకోత్సవ వేడుకల దిగ్విజయంపై గవర్నర్‌కు కృతజ్ఞతా సదస్సును నిర్వహించి వీసీ మాట్లాడారు. స్నాతకోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు ఏర్పాటుచేసి నెలరోజులపాటు శ్రమించారని అన్నారు. వారందరికీ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ఆరా

అనంతపురం అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): అర్బన్ మినీ మహానాడులో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. వెంకటేశ్‌కు మెరుగైన వైద్యం చేయించేందుకు బెంగళూరుకు పంపడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు తోడుగా టీడీపీ నాయకులు, డాక్టర్ హరిని పంపించామన్నారు. ఖర్చుకు వెనకాడకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని ఫోన్ ద్వారా అక్కడి వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.

దేశ సైనికులకు రూ.10 లక్షల విరాళం



అనంతపురం సెంట్రల్/శింగనమల, మే 21(ఆంధ్రజ్యోతి): దేశ సైనికుల సేవలకు తమవంతుగా రూ.10 లక్షల విరాళాన్ని అందజేసినట్లు ఎస్ఆర్ఐటీ కళాశాల చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియాకు చెందిన సైనికాధి కారులు బ్రిగేడియర్ నంజుండేశ్వరి, కర్నల్ సురేష్ గౌడ్‌కు బుధవారం కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిసి విరాళం మొత్తాన్ని చెక్కురూపంలో ఇచ్చామని ఆమె తెలిపారు.

పోలీసుల అదుపులో సురేష్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీసులు సురేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మోసకార్లు' అనే కథనానికి పోలీసులు స్పందించారు. కార్లను అద్దెకు తీసుకుని, వాటిని మరొకరికి కుదువ పెట్టి డబ్బు తీసుకుని ఆ కారుతో పరారీ అవుతున్న అతడిని పోలీసులు విచారిస్తున్నారు. బుధవారం వేణుగోపాల్ నగర్‌కు చెందిన హరికి కారును అప్పగించారు. బాధితులు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌ను కలిసి సమస్యలు చెప్పుకుంటున్నారు.

65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్/రాప్తాడు, మే 21(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం 65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఓ వాహనంలో కర్ణాటక రాష్ట్రంలోని బంగారు పేటకు అక్రమంగా తరలిస్తున్న 65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ జమాల్ బాషా ఆధ్వర్యంలో రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో గురువారం పట్టుకున్నారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గార్లదిన్నెకు చెందిన బియ్యం యజమాని శ్రీనివాసులు, డ్రైవర్ లాడెప్ప, వాహన యజమాని విష్ణువంశీపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక సీఎస్‌డీటీ జ్యోతికి అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఈఈ రవీంద్రనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్రవాహనాల వేలం

అనంతపురం క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న 18 ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఈనెల 23వ తేదీ ఉదయం 10గంటలకు వేలం వేస్తామని తెలిపారు.

మెట్లపై నుంచి జారి పడి వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమా నగర్‌లో ఓ వృద్ధుడు మెట్లపై నుంచి జారి పడి మృతి చెందాడు. ఉమానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం సింగ్(69) బుధవారం తన ఇంటి మెట్లపై నుంచి జారి కింద పడి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, టీడీపీ నాయకులు


మినీ మహానాడుకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తల కష్టం కళ్లారా చూశాం

● ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
● వారి రుణం తీర్చుకోలేనిది
● మినీ మహానాడులో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



గార్లదిన్నె, మే 21(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్ల వైసీపీ హయాంలో టీడీపీ కార్యకర్తల కష్టాన్ని కళ్లారా చూశాం. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసిన కార్యకర్తలకు తప్పక న్యాయం చేస్తాం. కార్యకర్తల రుణం తీర్చు కోలేనిది.' అని శింగనమల నియోజకవర్గం మినీ మహానాడులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలకేంద్రమైన గార్లదిన్నెలోని మర్తాడు క్రాస్ వద్ద టీ కన్వెన్షన్ హాల్‌లో మినీ మహానాడును బుధవారం నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నియోజకవర్గం పరిశీల కురాలు పర్వీన్‌తాజ్, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ రక్షణలో భాగంగా ప్రాణాలర్పించిన వీరజవాన్ల ఆత్మ శాంతికోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ ఐదేళ్లలో కుల, మతాలకు తావు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా చేస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో సైకో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేశారన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించి, అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుదే అన్నారు. అలాగే మంత్రి నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం గర్వకారణ మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసినా.. ఎవరూ భయపడకుండా పార్టీకి అండా నిలిచారన్నారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఉన్న సాగు, తాగు నీటి సమస్య పరిష్కారానికి పరిష్కరిస్తామన్నారు. అలాదే ప్రతినెలా ఒక మండలంలో అధికారులతో కలసి కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కష్టకాలంలో అండగా నిలిచారు

● ఎంపీ అంబికా



గత ఐదేళ్ల పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలెవరూ నిరుత్సాహ పడకుండా పార్టీకి అండగా నిలిచారని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ అన్నారు. వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఎన్ని కష్టాలకు గురి చేసినా అధైర్యపడకుండా ధైర్యంగా నిలబడ్డారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ 11 సీట్లకే పరిమితం అయిందంటే కార్యకర్తల కష్టమేనన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల రుణం తీర్చుకుంటామన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ అన్యాయానికి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడని పార్టీ అధినేతను జైల్లో పెట్టినా.. కార్యకర్తలు ఎక్కడా నిరుత్సాహపడకుండా మరింత కసితో ఎన్నికల్లో కష్టపడ్డారన్నారు. ఇదే రెట్టింపు ఉత్సాహంతో స్థానిక సమరంలోను వైసీపీ డిపాజిట్లు గల్లంతు అయ్యేలా కష్టపడాలని కార్యకర్తలను కోరారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

● ముంటిమడుగు కేశవరెడ్డి



తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీని వీడ కుండా పార్టీ విజయానికి ఎనలేని కృషి చేశారన్నారు. మనం ఈరోజు పదవుల్లో కూర్చున్నామంటే కార్యకర్తల శ్రమే అన్నారు. పార్టీకి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీ, ఎమ్మెల్యేకి ఆయన విన్నవించారు.

పాలనా దక్షుడు చంద్రబాబు

● ఆలం నరసానాయుడు



రాష్ట్రాభివృద్ధి కోసం నిత్యం శ్రమించే పాలనాదక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని ఆలం నరసానాయుడు కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్టీ రా మారావు తెలుగుదేశం పార్టీని స్థాపిం చారని, ఆయన అడుగుజాడల్లో సీఎం చంద్రబాబు పయనిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయు డు రాష్ట్రభివృద్ధి కోసం కృషి చేస్తుంటే.. యువనేత నారా లోకేశ్ కార్యకర్తల కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వాలి

● రామలింగారెడ్డి



పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపునివ్వాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి అన్నారు. వైసీపీ హయాంలో అక్రమ కేసులు బనాయించినా అధైర్యపడకుండా పార్టీ బలోపేతానికి కష్టపడ్డారన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా ఎంపీ, ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.

మినీ మహానాడులో తీర్మానాలివే...

గార్లదిన్నె మండలంలోని ఎంపీఆర్ గేట్లు ఆధునికీకరణ చేసి, డ్యాం పరిధిలోని అన్ని కాలువల డిస్ట్రిబ్యూటర్ల షట్టర్లు రిపేరీ చేయాలి. గార్లదిన్నెలో రైల్వే ట్రాక్ నుంచి హైవేలోకి సైడ్ డ్రైనేజీ సిస్టమ్ నిర్మించాలి. గార్లదిన్నె నుంచి కోటంక వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి. బుక్కరాయసముద్రం నుంచి గూగుడు, ఏడావు లపర్తి రోడ్డు మంజూరు చేయాలి. బుక్కరాయ సముంద్రంలో వివిధ కాలనీల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించాలి. నార్పల - కూతలేరు బ్రిడ్జి ఆధుని కీకరణ పూర్తి చేయాలి. నడిందొడ్డి వద్ద ఎత్తిపోతల పథకం ప్రారంభించాలి. సిద్ధాచర్ల చెరువులకు లోకనై జేషన్ చేసి నీరు నింపాలి. శింగనమల మరువ కొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మించాలి. చాగల్లు రిజర్వా యర్ కింద ముంపునకు గురైన ఉల్లికంటిపల్లె గ్రామస్థులకు ఆర్ఆర్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధులు మంజూరు చేయాలి. కల్లుమడి ఐదో డిస్ట్రిబ్యూటరీ వద్ద కల్లుమడి నుంచి సలకం చెరువు వరకు సుమారు 15 కిలో మీటర్ల మేర హెచ్చెల్సీలో పూడికతీత పనులు చేయాలి. గండికోట నుంచి సుబ్బరాయ సాగర్‌కు పైపులైన్ ఏర్పాటు చేయాలి. 89వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా బొప్పేపల్లి చెరువు వరకు సాగునీరు ఇవ్వాలి. పుట్లూరు మండల కేంద్రంలో హెచ్చెల్సీ పై బ్రిడ్జి నిర్మించాలి. పుట్లూరులో ఎస్సీ హాస్టల్ నిర్మించాలి. యల్లనూరు చిత్రవతి నది మీద ఎల్లనూరు సమపంలోని తాడిపత్రి - పులివెందుల రహదారి వద్ద, సింగాపురం సమీపంలో వంతెనలు నిర్మాంచాలి. శనగల గూడూరు నుంచి యల్లనరు మీదుగా సింహాద్రిపురం వర కు డబల్ రోడ్డు నిర్మించాలి. మండలకేంద్రమైన ఎల్లనూరు, కల్లూరు పంచాయతీలో డ్రైనేజీ నిర్మించాలని తీర్మానం చేశారు.

మినీ మహానాడు కార్యక్రమంలో డీసీ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, పర్వతనేని శ్రీధర్ బాబు, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల క్రిష్ణయ్య, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, శాలిని, నాయకులు ఆదినారాయణ, గేట్ క్రిష్ణారెడ్డి, ఇల్లూరు రామాంజి, పసుపుల శ్రీరామిరెడ్డి, గుత్తాబాలకృష్ణ, ఆకుల అంజినేయులు, డేగల కృష్ణామూర్తి, మారుతీనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్లు పాండు, గుత్తా లక్ష్మీనారాయణ, రామాంజినేయులు, ఆశోక్, ఎర్రనాగప్ప, జయరామ్, గోరకాటి వెంక టేష్, నరసింహారెడ్డి, చితంబరప్ప, సుంకన్న, చల్లా నాగరాజు, గుత్తా హరి, రమణప్ప, మాసూల్ చంద్రమోహన్, రాము, అంజి, బాబయ్య, సామల మధు, చితంబరి దొర తదితరులు పాల్గొన్నారు.

మినీమహానాడుకు తరలిరండి

● ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



రామగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట తిరుమల దేవర దేవస్థానం కల్యాణ మండపంలో గురువారం నిర్వహించే మినీమహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ఆమె వెంకటాపురంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... మినీ మహానాడును తిరుమల దేవర దేవస్థానం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పరిశీలకురాలు ఆదోని క్రిష్ణమ్మ, ఇతర ముఖ్యనాయకులు పాల్గొంటారన్నారు. గత రెండేళ్లగా జరిగిన పరిణామాలు, పార్టీ అధికారంలోకి వచ్చిన తీరు, కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులు వంటి అంశాల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. కావున నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సభ్యత్వ కార్డు ఉన్న వారు కండువా ధరించి పాల్గొనాలని కోరారు.

● అనంతపురం రూరల్: నసనకోటలో గురువారం నిర్వహించే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సిండికేట్ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించి మాట్లాడారు.

● కనగానపల్లి: నసనకోటలో గురువారం జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

'న్యాయ సేవలపై కనీస అవగాహన అవసరం'

అనంతపురం రూరల్, మే21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి న్యాయ సేవలపై కనీస అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాసదన్ న్యాయాధికారి రాజశేఖర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ కార్మికులను న్యాయ సేవసదన్ అందిస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయాధికారి హాజరై ఉపాధి సిబ్బందికి న్యాయ సేవలు, బాధ్యతల గురించి వివరించారు.

టీడీపీ గ్రామ కమటీల అధ్యక్షుల ఎంపిక

అనంతపురం రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులను బుధవారం ఎంపిక చేశారు. కురుగుంట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ధర్మేంద్రను ఎంపిక చేశారు. బుధవారం గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, రాప్తాడు నియోజకవర్గం తెలుగురైతు అధ్యక్షుడు నారాయణ స్వామి, తాజా మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, సీనియర్ నాయకులు వెంకటరాముడు ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ధర్మేంద్రన, ప్రధాన కార్యదర్శిగా వెంకటరాముడిని ఎంపిక చేశారు. అలాగే చిన్నంపల్లి కమిటీ అధ్యక్షుడిగా మాలపాటి రామాంజినేయులును మరోసారి ఎంపిక చేశారు. కామారుపల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దాసరి కుళ్ళాయప్ప, మగ్గం కుళ్ళాయప్పను ఎంపిక చేశారు. అలాగే ఇటీవల ఎంపికైన పాపంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎంపికైన సైపుల్లా ఇటుకపల్లి కమిటీ అధ్యక్షుడు బోయ వెంకటరాముడు బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీతను నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా గ్రామ కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గార్లదిన్నె, మే 21(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం మర్తాడు క్రాస్ వద్ద టీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మినీ మహానాడులో శింగనమల మండలం సలకంచెరువు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శీనాకు సీఎం సహాయ నిధి కింద రూ.6 లక్షల చెక్కును అందజేశారు. అలాగే అనంతపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గార్లదిన్నె మండలానికి చెందిన పెనకచెర్లకు చెందిన కురువ నాగమ్మకు రూ.77,063, ఉరవకొండ మండలం ఉదిరిపికొండకు చెందిన బోయ వన్నూరప్ప కుటుంబానికి రూ.1.25 లక్షలు అందజేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యజీవితంలో యోగా భాగం కావాలి

● యోగాంధ్ర ప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్


యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, అధికారులు


అనంతపురం క్లాక్‌టవర్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా మాసాన్ని ఈ రోజు నుంచి ప్రారంభించామన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి జూన్ 21వతేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం అధికారులు, క్రీడాకారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మలోలా, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఆయుష్ జిల్లా అధికారి రామకుమార్, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీపీఓ నాగరాజు నాయుడు, హార్టికల్చర్ డీడీ రఘునాథ్‌రెడ్డి, డీపీఈఓ వెంకటరమణనాయక్, డీటీడబ్ల్యూఓ రామాంజినే యులు, డీఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, శాప్ కోచ్‌లు అనిల్‌కుమార్, నరేష్‌కుమార్, యోగా కోచ్‌లు రాజశేఖర్ రెడ్డి, గురు రాజారావు, కృష్ణవేణి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మెస్‌బిల్లుల స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం టౌన్, మే 21ఆంధ్రజ్యోతి): మెడికోల మెస్‌బిల్లుల స్వాహా వ్యవహారం ఎట్టకేలకు పోలీస్‌స్టేషన్‌కు చేరింది. డీఎంఈ నరసింహం ఆదేశాల మేరకు మంగళవారం రాత్రే ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఇతర డాక్టర్లు, సిబ్బంది టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ మెస్ బిల్లుల స్వాహా వ్యవహారంపై సీఐకి వివరించి అందులో పాత్ర ఉన్న మహిళా అకౌంటెంట్‌పై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసారు. అదే సమయంలోనే డీఎంఈ నరసింహం సైతం టుటౌన్ సీఐతో నేరుగా ఫోన్‌లో మాట్లాడుతూ.. ఈ అక్రమవ్యవహారంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన విషయాన్ని ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు అధికారికంగా తెలియజేశారు.

ఇంత నిర్లక్ష్యమా..!

● ప్రజాశక్తి నగర్‌లో ఇళ్లకు కరెంట్
● కాలిపోయిన ఫ్యాన్‌లు, ఇన్వర్టర్లు
● 24 గంటలుగా చీకట్లో సగం కాలనీ


ప్రజాశక్తికాలనీ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్

అనంతపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యానికి కొన్ని సందర్భాలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కక్కలపల్లి పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం ఇందుకు ఉదాహరణ. బుధవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో బీజేపీ కొట్టాల, ప్రజాశక్తి కాలనీలోని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య కారణంగా ఇళ్ల గోడలకు, వస్తువులకు విద్యుత్ సరఫరా అయింది. పలు ఇళ్లలో విద్యుత్ వైర్లు, ఫ్యాన్‌లు, బల్బులు కాలిపోయాయి. ఇన్వర్టర్లు చెడిపోయాయి. ఒక రోజు గడిచినా అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించ లేదు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నేళ్లుగా స్థానికంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు ఇళ్ల గోడలకు కరెంటు సరఫరా అవుతోంది. రాత్రి వేళల్లో ఇళ్లలో లైట్లు ఆఫ్ చేసినా వెలుగుతున్నాయి. స్థానికంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్‌లోను సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు అంటున్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల సీపీఎం నాయకులు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అయినా ప్రయోజనం లేదు. సమస్య చెప్పిన వారిపై స్థానిక సిబ్బంది చిందులు వేస్తున్నారని చెబుతుండటం గమనార్హం. రెండురోజుల కిందట పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అది కూడా పాతదే కావడంతో సమస్య తిరిగి మొదటికి వచ్చింది. ఈ విషయంపై సంబంధిత ఏఈఈ సోమశేఖర్‌ను వివరణ కోరగా... సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కానీ బుధవారం రాత్రికి కూడా ఏర్పాటు చేయలేకపోయారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం, ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

యల్లనూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మహాకుంభాభిషేకంలో భాగంగా ఉదయాన్నే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాది కార్యక్రమాల అనంతరం ఆంజనేయస్వామి దండక పఠనం చేశారు. సాయంత్రం 5గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహించారు. తమిళనాడుకు చెందిన పురోహితుల బృందం కల్యాణోత్సవాన్ని జరిపించింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కూడేరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్కూరు గ్రామ లెప్రసీకాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్ (29) అనే యువకుడు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. విజయ్‌కుమార్ ఆదివారం సాయంత్రం అనంతపురం నుంచి కమ్మూరు గ్రామానికి ద్విచక్రవాహనంలో వస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనంలో ప్రమాదానికి గురైయ్యాడా? లేక ఎవరైన హత్యయత్నానికి పాల్పడారా అన్న అనుమానం కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కర్నూలులో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడని వివరించారు. మృతుడి అన్న నల్లప్ప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశం

కళ్యాణదుర్గం, మే 21(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై పలు రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దారు, ఎన్నికల అధికారి భాస్కర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులతో సమావేశమై అభ్యంతరాలను తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఏవైనా ఉంటే పక్కా ఆధారాలతో అందచేయాలన్నారు.

రేపు తిరంగా ర్యాలీ

తాడిపత్రి, మే 21(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో పట్టణంలో ఈనెల 23న ఉదయం 8 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మైదుకూరు ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీసర్కిల్ నుంచి అశోక్‌పిల్లర్ వరకు జాతీయ జెండాలను చేతబూని ఈ యాత్ర జరుగుతుందని ఆయన తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలి

గుంతకల్లుటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని కోరుతూ బుధవారం తహసీల్దారు రమాదేవికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా ఎండీయూ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమను 2027 వరకు కొనసాగించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎండీయూ ఆపరేటర్లు సురేష్, రంజిత్‌కుమార్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.15 వేలు విరాళం

శెట్టూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లిలో ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠ నిర్వహిస్తున్నారు అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో దేవినేని ధర్మతేజ రూ. 15 వేలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జి ఈఓఆర్‌డీగా మనోహర్‌బాబు

పుట్లూరు, మే21(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీగా యల్లనూరులో పనిచేసే మనోహర్‌బాబును నియమించినట్లు బుధవారం ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక్కడ పనిచేసే ఈఓఆర్‌డీ జిలాన్‌బాషా ఉద్యోగోన్నతిపై శెట్టూరు మండలానికి వెళ్లారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెజ్లింగ్ క్రీడాకారుడికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ బుధవారం ఆర్థికసాయం చేశారు. జయనగర్ కాలనీకి చెందిన సంతోష్ జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరుగుతున్న రెజ్లింగ్ పోటీలకు ఎన్నికయ్యారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రవాణా ఖర్చులకు ఆ విద్యార్థికి రూ. 5 వేలు ఆర్థికసాయం అందచేశారు.
● బ్రహ్మసముద్రం : బాధిత కుటుంబాలకు మాస్టారు బద్దేనాయక్, గ్రామ యువకులు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. మండల పరిధిలోని పిల్లలపల్లికి చెందిన వెంకటేశులు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ మరణించారు. వారి కుటుంబానికి కాలనీవాసులు రూ.9వేలు బద్దేనాయక్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో దొణ తిమ్మప్ప, శివారెడ్డి, రవి, హనుమంతు, తిమ్మన్న, వినయ్, మారెన్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ల యజమానులు అక్రమంగా పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని వివరించారు. ఐదు ట్రాక్టర్లను సీజ్‌చేసి తహసీల్దార్‌కు అప్పగించామని పేర్కొన్నారు. వారిపైన కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

కూలీలకు ఉపాధి కల్పించాలి: ఏపీడీ

రాయదుర్గం రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధిహామీ పనిలేదని కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినట్లు తమ దృష్టికి వస్తే క్షేత్రసహాయకులపై చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీఓ, ఇన్‌చార్జ్ ఏపీడీ నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఏపీడీ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరాజ్, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏపీడీ నాగేశ్వరరావు

భారీ వర్షాలకు నీటమునిగిన రహదారులు

● పలుచోట్ల నిలిచిన నీరు ● పొంగిన వాగులు, వంకలు ● ప్రయాణికుల అవస్థలు




వేదవతి-హగరిలో మునిగిన కణేకల్లు-ఉరవకొండ రహదారి, నాగిరెడ్డిపల్లిలో నిలువ ఉన్న నీరు, ఎర్రగుడి వద్ద పొంగిన వంక

కణేకల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): నిరంతరం కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల రహదారులు నీటమునిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కణేకల్లు మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కణేకల్లు - ఉరవకొండకు రహదారిలో మాల్యం వద్ద ఉన్న రహదారి వేదవతి హగరిలో మునిగిపోయింది. హనకనహాళ్ చెరువు పొంగి పొర్లడంతో వరదనీరు ఒక్కసారిగా వేదవతి-హగరిలో నదిని ముంచెత్తాయి. దీంతో బస్సు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో ప్రయాణికులు ఉరవకొండకు వెళ్లేందుకు ఆటోల ద్వారా స్థానిక హెచ్చెల్సీ కెనాల్‌పై మాల్యంకు చేరుకొని అక్కడ నుంచి ఉరవకొండ, దర్గాహోన్నూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.
● రాయదుర్గంరూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలవ ఉండడంతో గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజుల నుంచి కురిసిన వర్షానికి వర్షం నీరంతా ప్రధాన రహదారిపై నిలవ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోలేదని గ్రామస్థులు వివరించారు. నీరు నిలబడడంతో రాత్రివేళ నడక సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. కదరంపల్లి ఎస్సీకాలనీలో నిలువ ఉన్న వర్షపునీటిని మళ్లించాలని ఎస్సీ కాలనీకి చెందిన పెద్ద వన్నూరప్ప, రామన్న, కొల్లప్ప, వన్నూరుస్వామి ఎంపీడీఓ కొండన్నకు వినతి పత్రం ఇచ్చారు.
● బెళుగుప్ప : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు వర్షపునీటితో పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులకు నీరు చేరికతో జలకళను సంతరించుకున్నాయి. మండలంలో మంగళవారం రాత్రి 13.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముందస్తు వర్షాలతో నల్లరేగడి భూములు పదునవుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే


సీఎం సహాయనిధి మంజూరైన లబ్ధిదారులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మే 21(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అండగా సీఎం సహాయనిధి నిలిచిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే 30 మంది లబ్ధిదారులకు రూ. 33 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు సహాయనిధి విరివిగా మంజూరు చేస్తున్నారన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి సీఎం పెద్ద పీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాయదుర్గం విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు


బహుమతి అందుకుంటున్న అక్షయ

రాయదుర్గం, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీ విద్యాలయంలో పదో తరగతి పరీక్షల్లో 587 మార్కులు సాధించిన ఎన్. అక్షయ అనే విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డ్ దక్కింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అవార్డు పంపిణీ వేడుకల్లో ఆమెకు గోల్డ్‌మెడల్‌తో సత్కరించి బహుమతిని ప్రదానం చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తన నివాసంలో బుధవారం రూ. 5 వేల నగదు బహుమతిగా ఇచ్చి అభినందించారు.

డ్రిప్ నీరు తాగి ఏడు గొర్రెలు మృతి

కళ్యాణదుర్గం, మే 21 (ఆంధ్రజ్యోతి) : కంబదూరు మండల పరిధిలోని కదిరిదేవరపల్లిలో నివాసం వుంటున్న బొమ్మలింగప్పకు చెందిన ఏడు గొర్రెలు డ్రిప్ నీరు తాగి అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ. 90 వేలు ఆస్తినష్టం సంభవించింది. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గొర్రెలను మేత కోసం సమీప పొలాల్లోకి తీసుకెళ్లాడు. డ్రిప్‌లో అప్పటికే రసాయనిక మందులు వదలిన నీరు తాగడంతో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయని కాపరి తెలిపారు.

ఆక్రమణలను తొలగించాలి

యాడికి, మే21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో ఆక్రమణలు అన్నింటిని తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు తెలిపారు. బుధవారం యాడికిలో చెన్నకేశవస్వామి ఆలయం వెనుక భాగాన ఉన్న పూలతోట కాలనీలో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణలను అన్నింటిని తొలగిస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

శెట్టూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కూలీలను తీసుకెళుతున్న ఆటోను ఖాళీగా వెళుతున్న మరో ఆటో ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ప్రయాణికులతో వెళుతున్న ఆటోకు మరో ఆటో ఢీకొనడంతో ముచ్చర్లపల్లికి చెందిన భూమిక (32) అనే మహిళకు కుడికాలు పూర్తిగా దెబ్బతినింది. చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారని పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

తాడిపత్రి/పెద్దవడుగూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో బుధవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లతోపాటు గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దవడుగూరు మండలంలోని చిన్నవడుగూరులో ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.

బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ ఎన్నిక

బొమ్మనహాళ్, మే 21(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజీవ్ తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో కమిటీని ఎన్నుకున్నారు. బొమ్మనహాళ్ మండల అధ్యక్షుడిగా సిద్ధయ్య, ఉపాధ్యక్షుడిగా హనుమంతు, యూత్ అధ్యక్షుడిగా ఇస్మాయిల్, డి.హీరేహాళ్ మండల అధ్యక్షుడిగా లాలూసాబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

జనసేన కిట్ల పంపిణీ

బొమ్మనహాళ్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో బుధవారం జనసేన పార్టీ మండల కన్వీనర్ శివరాజ్ ఆధ్వర్యంలో పార్టీ కిట్లు, సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రూ.5 లక్షలు జీవిత బీమా, రూ.50 వేలు ప్రమాదబీమాకు సంబంధించిన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఐడీ కార్డులు, ప్రశంసా పత్రాలను పంపించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, శివరాం, ఖాదర్‌భాష, సురేష్ పాల్గొన్నారు.

దేశ సమగ్రత, శాంతికి కట్టుబడి ఉండాలి: డీఆర్‌ఎం

గుంతకల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతకు, దేశంలో శాంతికి, ప్రజల ఐక్యతకు రైల్వే ఉద్యోగులందరూ కట్టుబడి ఉంటామంటూ డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ప్రతిజ్ఞ చేయించారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక డీఆర్‌ఎం కార్యక్రమంలో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం రైల్వే ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.


ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

గుత్తిలో తిరంగా ర్యాలీ


తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

గుత్తి,మే21(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావటంతో పట్టణంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సర్కిల్ నుంచి రాజీవ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ర్యాలీ కొనసాగింది. జాతీయజెండాలను పట్టుకుని నినాదాలు చేశారు. ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్త, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, ఎంపీడీఓ ప్రభాకర్, బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, ఓబులయ్య, నారాయణ, వీరాంజినేయులు, చంద్రశేఖర్, మనోహర్, బాలకృష్ణ, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, రంగరాజు, బావిగడ్డ ఓబులయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



ఉరవకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కమలపాడు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మహబూబ్‌బాషా(28) మృతి చెందాడు. గుంతకల్లుకు చెందిన మహబూబ్‌బాషా వజ్రకరూరు తహసీల్దారు కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని గుంతకల్లుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కమలపాడు వద్ద ఎదురుగా వస్తున్న లగేజీ వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నరేష్ గుంతకల్లు ఆసుపత్రిలో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులకు నాలుగునెలల పాటు ఉచితంగా శిక్షణ పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హత కలిగిన యువతీ, యువకులు 25వ తేదీలోపు పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 9182920381 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

యాడికి, మే 21(ఆంధ్రజ్యోతి): యాడికిలో గొడవకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. ఒక ప్రైవేట్ ఆస్తికి సంబంధించి ఎమ్మార్పీఎస్ నాయకుల మధ్య వివాదం నెలకొందన్నారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసులు నమోదుచేసినట్లు తెలిపారు.

చెత్త సేకరణపై ఇంటింటి సర్వే

కుందుర్పి, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి దేవదాసు ఇంటింటికి వెళ్లి ప్రజల ద్వారా నేరుగా తెలుసుకున్నారు. కుందుర్పి ప్రధాన రహదారిలో మురుగునీటిని రోడ్డుపై వదులుతున్న ఇంటి యజమానులకు హెచ్చరించారు. దుకాణాలలో చెత్త డబ్బాలు పెట్టుకోవాలని, ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ, కార్యదర్శి రామాంజినేయులు, పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్రస్వామి

యాడికి, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న రాఘవేంద్రస్వామి ఆలయం మూడో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఆలయం వద్ద భజన కార్యక్రమాలు నిర్వహించారు.

వేగంగా పైపులైన్ లీకేజీ మరమ్మతులు

రాయదుర్గం, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ మరమ్మతులు వేగంగా సాగుతున్నాయి. రాతిబావివంక గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై కొన్ని నెలలుగా పైపులైన్‌కు పెద్ద ఎత్తున లీకేజీ ఏర్పడడంతో నీరంతా వృధా గా వెళుతోంది. ఈ నేపథ్యంలో రెండురోజుల పాటు తాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రేయింబవళ్లు శ్రమించి పైపులైన్ మరమ్మతులను చురుకు గా చేస్తున్నారు. గురువారం రాత్రికి మరమ్మతులు చేసి శుక్రవారం నీటిసరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.


మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

పండ్ల అలంకారంలో నెట్టికంటి



పండ్ల అలంకారంలో నెట్టికంటి మూలవిరాట్టు, ఉత్సవ విగ్రహానికి మల్లెపూలతో లక్షార్చన

గుంతకల్లు, మే21(ఆంధ్రజ్యోతి): దక్షిణాది హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం స్వామిని పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువనే స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలను నిర్వహించి అరటి, కమల, నారింజ, ఆపిల్, మామిడి, కళింగర, తదితర పండ్లతో అలంకారాలు చేశారు. ఉదయం 7 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, అర్చన, వేద, సుందరకాండ, మన్యుసూక్త పారాయణాలు, హోమాలు చేశారు. శ్రీరామ, ఆంజనేయ స్వామివార్ల మూలమంత్ర అనుష్టాన హోమాలు, సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహానికి మల్లెపూలతో లక్షార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త కె. సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి నేమకల్లు ముస్తాబు



బొమ్మనహాళ్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుజ్జయంతిని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం గంగాజలంతో అభిషేకం, పుష్పాలంకరణ, హనుమద్ వ్రతం, పవమాన హోమం అనంతరం మహామంగళహారతి ఇవ్వనున్నట్లు అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా గోపుర కలశ స్థాపన


గోపురంపై ప్రతిష్ఠించిన కలశం

బెళుగుప్ప, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడిలో బుధవారం హనుమంతరాయస్వామి ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠ పూజలు చేశారు. ఉదయం గణపతి గంగ గోపూజలు, మహాబలి, పూర్ణాహుతి, గోపుర కలశ ప్రతిష్ఠ, మహా మంగళహారతి పూజలు చేశారు. గురువారం హనుజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, మండలంలోని గంగాదేవిపల్లిలోని గంగాభవానీ ఆలయానికి సంబంధించి ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు దేవదాయశాఖ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు.